ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
పార్వతీపురం మన్యం
జిల్లా వార్తలు
గురువారం 31 అక్టోబరు 2024





మట్టి ప్రమిదలను కొనుగోలు చేస్తున్న దృశ్యం

దీపావళి సందడి

- నింగినంటిన బాణసంచా, పూజా సామగ్రి ధరలు
- కిటకిటలాడిన మార్కెట్లు ● బెంబేలెత్తిపోయిన ప్రజలు



పాలకొండలో రద్దీగా మార్కెట్

పాలకొండ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో దీపావళి సందడి నెలకొంది. గురువారం పండగను ఘనంగా జరుపుకునేందుకు ప్రజలు సన్నద్ధమయ్యారు. లక్ష్మీదేవిని పూజించి.. బాణసంచా కాల్చేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. దీపావళి పండగ నేపథ్యంలో జిల్లాకు కొత్త కళ వచ్చింది. బాణసంచా, పూజా సామగ్రి కొనుగోలు చేసే వారితో బుధవారం పార్వతీపురం, పాలకొండ, సాలూరు, కురుపాం నియోజకవర్గాల్లో మార్కెట్లన్నీ కిటకిటలాడాయి. స్వీట్స్, బంగారు, వస్త్ర, కిరాణా షాపులు కళకళలాడాయి. అయితే మందు గుండు సామగ్రి ఏటా లాగే ధరలు నింగినంటాయి. పండగ మరుసటి రోజు నుంచి కార్తీక మాసం ప్రారంభం కానుండడంతో మరోవైపు కొబ్బరికాయలు, పండ్లు, పూలతో పాటు వివిధ రకాల పూజా సామగ్రి ధరలు కూడా అమాంతం పెరిగాయి. దీంతో ప్రజలు బెంబేలెత్తిపోయారు. నిన్న మొన్నటి వరకు అన్ని రకాల పండ్లు కిలో రూ.వంద నుంచి రూ.150 కు లభించగా.. ప్రస్తుతం రూ.200 నుంచి రూ.250 వరకు విక్రయిస్తున్నారు. బంతి, చామంతి, గులాబీ తదితర పూల ధరలు కిలో రూ.300 నుంచి రూ.400 పలకగా నేడు రూ.600 నుంచి రూ.800కు అమ్ముతున్నారు. అయితే ఎవరి స్థోమతను బట్టి వారు కొనుగోలు చేశారు.

- జిల్లాలోని పదుల సంఖ్యలో మందుగుండు సామగ్రి విక్రయాల షాపులు వెలిశాయి. అన్ని మండల కేంద్రాలతో పాటు ప్రధాన పట్టణాల్లో టపాసులు అమ్మకాలు మొదలయ్యాయి. అయితే గత ఏడాదితో పోలిస్తే బాణాసంచా సామగ్రి ధరలు పది నుంచి 20 శాతం వరకు పెరిగినట్టు వినియోగదారులు చెబుతున్నారు. కాగా అత్యధికులు పరిమిత స్థాయిలోనే వాటిని కొనుగోలు చేశారు.

-పూర్తి వివరాలు 6వ పేజీలో..



అమర వీరులను స్మరిస్తూ..

బెలగాం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా బుధవారం ఎస్పీ మాధవరెడ్డి ఆధ్వర్యంలో కలెక్టరేట్ నుంచి బస్టాండ్ వరకు పోలీసులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారి త్యాగాలను గుర్తుచేసుకున్నారు. బస్టాండ్ వద్ద అమర వీరుల చిత్రపటాల వద్ద కొవ్వొత్తులు వెలిగించి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ దిలీప్‌కిరణ్, ఏఆర్ డీఎస్పీ వెంకట అప్పారావు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

దీపంతో వెలుగులు

- ఇక ఏటా మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు

- దీపం-2 పథకం కింద నేటి నుంచే పంపిణీ
- కూటమి ప్రభుత్వం దీపావళి కానుక
- ఇప్పటికే బుకింగ్ ప్రారంభం
- జిల్లాలో లక్షలాది మందికి లబ్ధి

పార్వతీపురం, అక్టోబరు30 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం జిల్లా ప్రజలకు దీపావళి కానుక అందించింది. గురువారం నుంచి దీపం-2 పథకంతో ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీకి రంగం సిద్ధం చేసింది. ఇకపై ప్రతి కుటుంబానికి ఏటా మూడు వంట గ్యాస్ సిలిండర్లు అందనుండగా.. జిల్లాలో లక్షలాది మంది లబ్ధిపొందనున్నారు. ఈ పథకానికి అర్హులైన వారు ఇప్పటికే బుకింగ్ ప్రారంభించారు. సూపర్ సిక్స్‌లో భాగంగా తొలుత పింఛన్లను పెంచిన కూటమి ప్రభుత్వం తాజాగా ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీకి శ్రీకారం చుట్టడంతో జిల్లావాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ఇవి తప్పనిసరి..

- దీపం-2 పథకం కింద ఉచిత గ్యాస్ సిలిండర్ పొందాలంటే లబ్ధిదారుని గ్యాస్ కనెక్షన్ కచ్చితంగా వినియోగంలో ఉండాలి.
- బియ్యం కార్డు, ఆధార్ కార్డుతో పాటు ప్రభుత్వ డేటా బేస్‌తో వారి వివరాలు అనుసంధానమై ఉండాలి.
- గ్యాస్ కనెక్షన్‌కు రిజిస్టర్ అయిన సెల్‌ఫోన్ నెంబర్ లేదా సంబంధిత ఆయిల్ కంపెనీ ద్వారా ఈకేవైసీ ప్రక్రియ పూర్తవ్వాలి.

ఇదీ పరిస్థితి..

జిల్లాలోని 15 మండలాల్లో 17 గ్యాస్ ఏజెన్సీల ద్వారా ప్రజలకు వంట గ్యాస్ సిలిండర్ సరఫరా అవుతుంది. పార్వతీపురం, సాలూరు, పాచిపెంట, గుమ్మలక్ష్మీపురం, గరుగుబిల్లి, కొమరాడ, జియ్యమ్మవలస, మక్కువ, బలిజిపేట, వీరఘట్టం, పాలకొండ, సీతానగరం, భామిని, పాలకొండలో రెండు, సాలూరులో రెండు, గుమ్మలక్ష్మీపురంలో రెండేసి చొప్పున ఏజెన్సీలున్నాయి. మిగిలిన ప్రాంతాల్లో ఒక్కో ఏజెన్సీ ద్వారా సిలిండర్ల పంపిణీ జరుగుతుంది. కాగా జిల్లాలో 2,57,604 మంది లబ్ధిదారులున్నారు. ఇందులో సింగిల్ కనెక్షన్ ఉన్నవారు 1,05,569 మంది, డబుల్ కనెక్షన్ 44,610 మంది, దీపం లబ్ధిదారులు 75,481 , సీఎస్ఆర్ ద్వారా సిలిండర్ పొందుతున్న వారు 18798 మంది, ఉజ్వల కనెక్షన్ దారులు 13146 మంది ఉన్నారు. వారంతా ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు పొందడానికి అర్హులు.

- ప్రతి నాలుగు నెలలకు ఒక సిలిండర్ చొప్పున వారు పొందొచ్చు. గ్యాస్ సిలిండర్ బుక్ చేసుకునే సమయంలో ముందుగా లబ్ధిదారులు నగదు చెల్లించాల్సి ఉంటుంది. 24 నుంచి 48 గంటల్లో తిరిగి వారి ఖాతాల్లోకి ఆ నగదు జమవుతుంది. కాగా నేటి నుంచి వచ్చే ఏడాది మార్చి 31లోపు మొదటి సిలిండర్ బుక్‌చేసుకోవచ్చు.
- ఏటా ఏప్రిల్-జూలై , ఆగస్టు-నవంబరు, డిసెంబరు-మార్చిలోపు సిలిండర్లను ఉచితంగా పొందొచ్చు.
- నవంబరు ఒకటో తేదీన సాలూరులో మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, పార్వతీపురం, పాలకొండ, కురుపాంలో ఎమ్మెల్యేలు బోనెల విజయచంద్ర, నిమ్మక జయకృష్ణ, తోయక జగదీశ్వరి ఆధ్వర్యంలో ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. ఈ మేరకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.
- ' వచ్చేనెల నుంచి జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో దీపం-2 పథకం ప్రారంభమవుతుంది. ప్రజాప్రతినిధులతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నాం. అర్హులందరికీ ఉచిత గ్యాస్ సిలిండర్లు అందిస్తాం. అయితే వినియోగదారులు విధిగా ఈకేవైసీ చేయించుకోవాలి. ఇతర వివరాలకు సంబంధిత అధికారులు, గ్యాస్ ఏజెన్సీలను సంప్రదించాలి.' అని ఇన్‌చార్జి డీఎస్‌వో శ్రీనివాసరావు తెలిపారు.



ప్రతి విద్యార్థికీ 'అపార్'

- కార్డులు జారీ చేయాలని కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ఆదేశం

బెలగాం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలో కేజీ నుంచి పీజీ చదివే ప్రతి విద్యార్థికీ అపార్ (ఆటోమేటిక్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్టర్) కార్డులను జారీ చేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల సమావేశ మందిరంలో ఆయన మాట్లాడుతూ... వన్ నేషన్ - వన్ ఐడీ పేరుతో 17 నెంబర్లతో ఐడీకార్డు ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందన్నారు. ఇప్పటికే కొన్ని రాష్ట్రాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేసిందని చెప్పారు. ఏపీలో కూడా కార్డులను జారీ చేయనున్నట్లు వెల్లడించారు. విద్యార్థుల వివరాలతో పాటు యూనిఫైడ్ డిస్ట్రిక్ ఇన్ఫర్మేషన్ ఫర్ ఎడ్యుకేషన్ (యూడీఐఎస్ఈ) వివరాలు కూడా నమోదు చేయాలని, అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. డీఈవో తిరుపతి నాయుడు, ఎంఈవోలు, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

- షై స్కూల్ - షై ఫ్రైడ్ కార్యక్రమంలో భాగంగా స్థానిక డీవీఎం పురపాలకోన్నత పాఠశాలను కలెక్టర్ సందర్శించారు. విద్యార్థులకు పాఠ్యాంశాలపై సంపూర్ణ విజ్ఞానం కలిగించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. టెన్త్ విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచాలని, చదువులో వెనుకబడిన వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఆదేశించారు.
- పార్వతీపురం, అక్టోబరు30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అర్హులైన ప్రతి ఒక్కరు ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం కింద మంజూరైన కారును లబ్ధిదారుడు మీసాల రాహుల్‌కు కలెక్టర్ అందించారు. 8వ తరగతి విద్యార్హత కలిగిన ప్రతి ఒక్కరూ పీఎంఈజీపీకి అర్హులన్నారు. ఇందులో 30 శాతానికి పైగా కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ లభిస్తుందని కలెక్టర్ తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

టీడీపీలోకి వైసీపీ కౌన్సిలర్లు

పార్వతీపురంటౌన్, అక్టోబరు 30 : మున్సిపాల్టీలో 7, 9, 10 , 11, 12 వార్డులకు చెందిన వైసీపీ కౌన్సిలర్లు బి.ఆనంద్, జయంతి, దివ్య, జి.కల్యాణి, టి.అరుణలు టీడీపీలో చేరారు. ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర ఆధ్వర్యంలో వారు ఆ పార్టీ కండువాలు కప్పుకున్నారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐదుగురు వైసీపీ కౌన్సిలర్లు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, టీడీపీ విధి విధానాలు నచ్చి వైసీపీ కౌన్సిలర్లు స్వచ్ఛందంగా టీడీపీలో చేరారని తెలిపారు. వైసీపీ అధినేత జగన్.. తల్లి, చెల్లికి చేసిన అన్యాయం రాష్ట్ర ప్రజలకే కాకుండా ఆ పార్టీలో ఉన్న నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులకు అర్థమైందన్నారు. ఇదిలా ఉండగా ప్రస్తుతం కో ఆప్షన్ సభ్యులు, కొత్తగా చేరిన వైసీపీ కౌన్సిలర్లతో టీడీపీ సభ్యుల సంఖ్య 13కు చేరింది. మున్సిపాల్టీలో 30 వార్డులు ఉండగా.. గతంలో ఐదుగురు టీడీపీ, ఇద్దరు ఇం డిపెండెంట్ , ముగ్గురు కో ఆప్షన్ సభ్యులు మినహా మెజార్టీ సభ్యులంతా వైసీపీ వారే ఉండేవారు. తాజాగా ఐదుగురు వైసీపీ కౌన్సిలర్లు ఒకేసారి టీడీపీలో చేరడం చర్చనీయాంశమైంది. ఆ పార్టీ నేతల్లో కలవరం మొదలైంది.



టీడీపీలో చేరిన వైసీపీ కౌన్సిలర్లతో ఎమ్మెల్యే విజయచంద్ర

అక్కడ అన్నీ రెండే..

- కొఠియా గిరిజనులకు ఏపీ, ఒడిశా ప్రభుత్వాల సౌకర్యాలు

6లో



ఐదేళ్లుగా ఇంతే..

- జిల్లా కేంద్రాసుపత్రిలో ఐసీయూ ఉన్నా..ఉపయోగం సున్నా

బెలగాం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): పార్వతీపురం జిల్లాకేంద్రా సుపత్రిలో ఐసీయూ(ఇంటెన్సివ్ కేర్ యూనిట్) ఉన్నా.. ఫలితం లేకుండా పోయింది. దీనిద్వారా పూర్తిస్థాయిలో వైద్యసేవలు అందడం లేదు. దీంతో అత్యవసర వేళల్లో రోగులను ఇతర జిల్లాల్లో ఆసుపత్రులకు రిఫర్ చేయాల్సి వస్తోంది. ఒకటి కాదు.. రెండు కాదు ఐదేళ్లుగా ఇదే పరిస్థితి నెలకొంది. వాస్తవంగా కేంద్రాసుపత్రికి రోగుల తాకిడి ఎక్కువ. జిల్లావాసులతో పాటు ఒడిశా నుంచి అత్యధికులు ఇక్కడకు వస్తుంటారు. సీజన్‌లో అయితే రెట్టింపు సంఖ్యలో ఓపీ ఉంటుంది. ఈ నేపథ్యంలో జిల్లా విభజన కాకముందు పార్వతీపురం ఏరియా ఆసుపత్రిలో ఐసీయూ ఏర్పాటుకు గత టీడీపీ ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. అయితే ఇంటెన్సివ్ కేర్ యూనిట్ ఏర్పడినా.. రోగులకు అత్యవసర వైద్య సేవలు అందుబాటులోకి రాలేదు. దీనికి ప్రధాన కారణం గత వైసీపీ ప్రభుత్వమే. జిల్లా కేంద్రాసుపత్రిపై పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఐసీయూ ఉన్నా ఉపయోగం లేకుండా పోయింది. వాస్తవంగా ఐసీయూ ద్వారా పూర్తి స్థాయిలో సేవలందించాలంటే.. ప్రత్యేక వైద్య నిపుణులు, సిబ్బందిని నియమించాల్సి ఉంది. రోగులకు అవసరమైన పరికరాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. అయితే గత వైసీపీ ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోలేదు. దీంతో లక్షలాది రూపాయలతో ఏర్పాటు చేసిన ఐసీయూ నిరుపయోగంగా మారింది. ఇది అందుబాటులోకి వస్తే రోగులను రిఫర్ చేసే పరిస్థితి ఉండదని స్థానికులు భావిస్తున్నారు. దీనిపై కూటమి ప్రభుత్వం స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.



సేవలు అందిస్తున్నాం

జిల్లా కేంద్ర ఆసుపత్రిలో ఉన్న ఇద్దరు అనస్థిషియా వైద్యుల ద్వారా రోగులకు సేవలు అందిస్తున్నాం. ఐసీయూలో ప్రత్యేక టెక్నీషియనను నియమించాల్సి ఉంది. ఆసుపత్రి సిబ్బందితో ఐసీయూ ద్వారా పూర్తిస్థాయిలో సేవలు అందిస్తున్నాం.

- వాగ్దేవి, సూపరింటెండెంట్, జిల్లా కేంద్రాసుపత్రి

ఐదు మండలాల్లో 132 గోకులాలు

గరుగుబిల్లి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): సీతంపేట క్లస్టర్ పరిధిలోని ఐదు మండలాల్లో 132 గోకులాలు మంజూరు చేసినట్లు ఉపాధి హామీ ఏపీడీ శ్రీహరినాయుడు తెలిపారు. బుధవారం ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ.. మండలానికి 1200 సోప్ పిట్లు మంజూరు చేయగా డిసెంబరు లోగా పనులు పూర్తి చేయాల్సి ఉందన్నారు. పల్లె పండగలో భాగంగా ఇప్పటికే ప్రారంభించిన నిర్మాణాలు సకాలంలో పూర్తికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ప్రధానంగా భూగర్భ జలాలు పెంపొందించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. పంచాయతీల పరిధిలో తీర్మానం చేసిన పనులకు మొదటి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలిపారు. సీసీ రోడ్లు, డ్రైనేజీలతో పాటు పలు నిర్మాణాల బాధ్యతను గిరిజన సంక్షేమం, పంచాయతీ రాజ్ శాఖలకు అప్పగించామని వెల్లడించారు. ప్రతి వారం చెల్లింపులు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీడీవో పైడితల్లి, ఏపీవో గౌరీనాథ్, ఈసీ ఎం.హరికృష్ణ పాల్గొన్నారు.

'ఉపాధి'లో మనమే టాప్

- పని దినాల వినియోగంలో జిల్లా ఫస్ట్



పార్వతీపురం, అక్టోబరు30 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో అత్యధికంగా పని దినాలను వినియోగించుకోవడంలో రాష్ట్రంలోనే జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. గత ఏడాది ఏప్రిల్ నుంచి సెప్టెంబరు వరకు 87 లక్షల 60 వేల పనిదినాలను వేతనదారులు వినియోగించుకుంటే ఈ సంవత్సరంలో 1.04 కోట్ల పనిదినాలు వినియోగించుకున్నారు. జిల్లాలోని 15 మండలాల పరిధిలో 450 గ్రామ పంచాయతీలుండగా.. వాటిల్లో రెండు లక్షల 9 వేల జాబ్‌కార్డులున్నాయి. మొత్తంగా మూడు లక్షల 96 వేల మంది వేతనదారులు ఉన్నారు. ప్రస్తుతం 193 వేల జాబ్‌కార్డులు యాక్టివిటీలో ఉండగా.. మూడు లక్షల 51 వేల మంది పనులు చేపడుతున్నారు. వేతనదారులు అత్యధికంగా పని దినాలు వినియోగించుకోవడం వల్లే జిల్లా ప్రథమ స్థానంలో నిలిచినట్లు డ్వామా పీడీ రామచంద్రరావు తెలిపారు. అందరి సహకారంతోనే ఇది సాధ్యమైందన్నారు. కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ఆదేశాల మేరకు అర్హులందరికీ పనులు కల్పిస్తున్నామన్నారు.



ఆనంద దీపాలు వెలిగిద్దాం!



- దీపావళి వేళ అప్రమత్తత అవసరం ● రసాయనాలతో పొంచి ఉన్న ప్రమాదం ● దీపాల వెలుగులే ఉత్తమం

కొమరాడ/రాజాం రూరల్/విజయనగరం క్రైం అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి):

వెలుగు పూల పండుగ దీపావళి వచ్చేసింది. దీపావళి అంటే దీపాల వరుస అని అర్థం. ప్రస్తుతం అనేక మంది దీపాలను వెలిగించడానికి బదులు రూ.వేలకు వేలు వెచ్చించి విషపూరిత రసాయనాలతో తయారు చేసిన బాణసంచాను కాల్చుతున్నారు. దీంతో అటు పర్యావరణానికి, ఇటు ఆరోగ్యానికి ప్రమాదం పొంచి ఉందని పర్యావరణ వేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పర్యావరణ హితంగా పండగను జరుపుకోవాలని సూచిస్తున్నారు. మోదం వెంటే ప్రమాదాలు పొంచి ఉంటాయి. దీపావళి వేళ అప్రమత్తత కీలకం. ఏటా మందు గుండు పేలుళ్లతో ఎందరో ప్రాణాలు కోల్పోతున్నారు. ఆస్తినష్టం కూడా భారీగానే ఉంటోంది. బాణసంచా తయారీ మొదలు, నిల్వ చేయడం, తరలించడం, విక్రయించడం... వాటిని కొనుగోలు చేసి కాల్చడం వరకూ ప్రమాదాలకు ఆస్కారం ఎక్కువ. తగినన్ని జాగ్రత్తలు తీసుకుంటూ కాలిస్తే కలిగే ఆనందం అంతా ఇంతా కాదు.

నూనెతో వెలిగిస్తే...

నూనెతో వెలిగే దీపాలను ఇంటిల్లిపాదీ కలిసి వెలిగిస్తూ అద్వితీయ ఆనందాన్ని పొందవచ్చు. విద్యుత్‌ను భారీగా ఆదా చేయవచ్చు. కష్టపడి మట్టితో ప్రమిదలు తయారు చేసి రోడ్డు పక్కన విక్రయించే పేద కార్మికులకు పట్టెడన్నం పెట్టొచ్చు. ఒకసారి నూనె పోసి వెలిగిస్తే మూడు నుంచి నాలుగు గంటల పాటు దీపాలు వెలుగుతాయి.

శబ్ద నియంత్రణ ముఖ్యం..

జనావాసాల మధ్య కాల్చే బాణసంచా శబ్దం 45 డెసిబుల్స్‌కు మించరాదని నిపుణులు సూచిస్తున్నారు. ప్రస్తుతం మనం కాలుస్తున్న బాణసంచా శబ్దాల స్థాయి దాదాపు 100 డెసిబుల్స్ పైగానే ఉంటోంది. దీపావళి పండుగకు ముందు వాతావరణంలో వాయు కాలుష్య స్థాయి 60 ఉంటే..పండుగ తరవాత దాదాపు 100 దాటుతోందని కాలుష్య నియంత్రణ మండలి అధికారులు చెబుతున్నారు. దీని వల్ల వినికిడి సమస్యలు తలెత్తుతున్నాయని పరిశోధనలు చెబుతున్నాయి. ధ్వని కాలుష్య ప్రభావం జంతువులు, చిన్న పిల్లలు, వృద్ధులపై ఎక్కువగా ఉంటుందని స్పష్టం చేస్తున్నాయి. చెట్లపైకి తారాజువ్వలు, రాకెట్లు వంటివి వేసి పక్షి జాతులకు ఇబ్బంది కలిగించకూడదు. హైబీపీ, గుండె జబ్బులు ఉన్నవారు తీవ్రంగా ఇబ్బందులు పడతారు. ఇళ్లలో పక్షులను, పెంపుడు జంతువులను ఉంచి బాణసంచా కాల్చరాదు. వీలైతే టీవీ, సినిమా పాటలు పెట్టి వాటికి శబ్దాల తీవ్రత ఎక్కువగా తగలకుండా చూడాలి.

ఇలా చేయండి..

● టపాసులు చట్ట ప్రకారం లైసెన్స్ కలిగిన వ్యాపారుల వద్ద కొనాలి. ● పిల్లలు టపాసులు కాల్చేటపుడు పెద్దలు వెంట ఉండి పరిశీలించాలి. ● బాణసంచా పెట్టెల మీద రాసి ఉన్న జాగ్రత్తలను తప్పనిసరిగా పాటించాలి. ● కొవ్వొత్తి, అగరబత్తిని మాత్రమే టపాకాయలను కాల్చేందుకు వాడాలి. ● టపాసులు కాల్చేటపడు నీటిని కూడా అందుబాటులో ఉంచుకోవాలి. ● ప్రమాదకరమైన బాంబులను నివాసాల మధ్య పేల్చకుండా ఉండటం మంచిది. ● గాలిలో పేల్చే టపాసులను విశాలమైన స్థలంలో కాల్చడం మంచిది. ● ఒకసారి నిప్పంటించిన టపాసు పేలకపోతే వాటిని తిరిగి వెలిగించేందుకు తొందర పడకూడదు. ● పేలని టపాసును నీళ్లలో ముంచి పక్కన పడేయడం మంచిది.

చిన్నారులు జాగ్రత్త..

అప్పుడే పుట్టిన పసికందుల నుంచి ఐదేళ్ల చిన్నారుల వరకూ దీపావళి రోజు వచ్చే శబ్దాలకు మానసికంగా కుంగిపోతుంటారు. అత్యధికంగా వచ్చే శబ్దాలు, కాపర్, లెడ్, సోడియం వంటివి మండటం వల్ల వచ్చే పొగ వారి ఊపిరితిత్తుల్లోకి వెళ్లి శ్వాస కోస వ్యాధుల బారిన పడతారు.

● ఇవి చేయకూడదు..

● కాకరపువ్వులు, మతాబులు, భూ చక్రాలు, విష్ణు చక్రాలు కాలిన తరువాత వాటిని కాలితో తన్నడం మంచిది కాదు. ● టపాసులను చేతిలో పట్టుకుని కాల్చకూడదు. ● పనిచేయని వాటిని వెలిగించే ప్రయత్నం చేయకూడదు. ● గాలిలో పేల్చే పటాసుల్ని విద్యుత్ తీగల వద్ద, డాబాలు, చెట్లు, ఆకుల కింద కాల్చితే ప్రమాదాలు సంభవిస్తాయి. ● బాణసంచా తయారు చేసేటపుడు ప్రయోగాలకు దూరంగా ఉండాలి.

● పాటించాల్సినవి ఇవే..

● వయో వృద్ధులు, పసిపిల్లలు, మహిళలు, హృద్రోగం, అనారోగ్యంతో ఉన్న వారికి సమీపంలో టపాసులు పేల్చకూడదు. ● బాణసంచా దుకాణాల్లో విద్యుదాఘాతం వల్లనే ఎక్కువగా ప్రమాదాలు సంభవిస్తాయి. అందుకే దుకాణాల్లో విద్యుత్ వైరింగ్ ఏర్పాటు చేసే సమయంలో జాగ్రత్తలు పాటించాలి. ● ప్రతి దుకాణంలో ఏర్పాట్లను పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది తప్పనిసరిగా తనిఖీ చేయాలి. ● పొరపాటున ప్రమాదం జరిగితే వెంటనే పోలీసు, అగ్నిమాపక కేంద్రాలకు సమాచారం ఇవ్వాలి.



పోలీసులదీ బాధ్యతే..

● విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు సమీపంలో షాపుల ఏర్పాటు కాకుండా చర్యలు తీసుకోవాలి. ● హైటెన్షన్ విద్యుత్ తీగల కింద షాపులు పెట్టకుండా ముందు జాగ్రత్తలు తీసుకునేలా ఆదేశించాలి. ● ప్రభుత్వ, ప్రయివేటు సంస్థల ఆస్తులు పరిసర ప్రాంతాలలో ఉండకూడదు. ● షాపు ఏర్పాటు చేసే స్థలానికి 500 మీటర్ల లోపు గడ్డికుప్పలు ఉండకూడదు.

అగ్నిమాపక శాఖ నిబంధనలివీ..

● మందుగుండు విక్రయించే షాపులు ఊరికి ఆవల ఏర్పాటయ్యేలా చూడాల్సిన బాధ్యత అగ్నిమాపక శాఖదే. ● కొనుగోలు చేసేందుకు ప్రజలు షాపు వద్దకు వెళ్లినపుడు అకస్మాత్తుగా ప్రమాదం జరిగితే తప్పించుకునేందుకు వీలుండాలి. ● దుకాణాల మధ్య మూడు మీటర్ల దూరం ఉండేలా చూడాలి. ● పొగతాగరాదనే బోర్డులు ఏర్పాటు చేయాలి. నీటి సదుపాయం కల్పించాలి. ● డ్రై కెమికల్ పౌడర్ నాలుగైదు కిలోలు, సీఓటూ (కార్బన్ డై ఆక్సైడ్) అయిదు కిలోలు దుకాణంలో నిల్వ ఉండేలా చూడాలి.



● అనుమతి తప్పనిసరి..

టపాసుల విక్రయదారులు తప్పనిసరిగా రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక శాఖ అధికారుల నుంచి అనుమతులు తీసుకోవాలి. హోల్‌సేల్ దుకాణాల నుంచి కొనుగోలు చేసిన బాణసంచా ఎగుమతి, దిగుమతి సందర్భంగా జాగ్రత్తలు పాటించాలి. భారీగా కొనుగోలు చేసిన టపాసులను ఆవాసాల్లో నిల్వ చేయకూడదు. టపాసుల విక్రయ దుకాణాలను ఇళ్లకు దూరంగా ఖాళీ మైదానాల్లో ఏర్పాటు చేయాలి. దుకాణాల వద్ద నీరు, ఇసుక అందుబాటులో ఉంచుకోవాలి.

● ప్రమాదాలను నివారించాలంటే...

● పేలే టపాసులకు దూరంగా ఉండాలి. ● బాణసంచా కాల్చేటపుడు కాటన్ దుస్తులు ధరించాలి. ● బాణసంచా భారీగా కొనుగోలు చేసి గృహాల్లో నిల్వ చేయవద్దు. ● ఐఎస్ఐ మార్కు కంపెనీల బాణసంచాను మత్రమే కొనాలి. ● సూర్యరశ్మిలో అవసరం మేరకు మాత్రమే టపాసులు ఆరబెట్టాలి. ● కాలి గాయమైతే ప్రథమ చికిత్స కోసం వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. ● గాయమైతే ఆయిల్, సిరా పూయరాదు. ● దుకాణాలకు సమీపంలో టపాసులు పేల్చకుండా జగ్రత్త పడాలి. ● టపాసులు విక్రయించే ప్రదేశంలో ఎవరూ చుట్ట, బీడీ, సిగరెట్టు తాగకుండా వ్యాపారులు అప్రమత్తంగా ఉండాలి.

● అక్రమంగా విక్రయిస్తే చర్యలు..

లైసెన్స్ లేకుండా అక్రమంగా బాణసంచా అమ్మకాలు చేపడితే చర్యలు తప్పవని రాజాం టౌన్ సి.ఐ. కె.ఎ. కుమార్ స్పష్టం చేశారు. నాలుగు చక్రాల బండ్లతో పాటు గ్రామాలలో ఇళ్ల వద్ద సైతం అమ్మకాలు చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

● ప్రమాదాలు సంభవిస్తే..

బాణసంచా కాల్చే సమయంలో అనుకోకుండా ప్రమాదాలు సంభవించే అవకాశం ఉంది. అందుకే ప్రథమ చికిత్స కిట్‌తో పాటు నీటిని అందుబాటులో ఉంచుకోవాలి. శరీరం లేదా చేతులు కాలితే మంట తగ్గేవరకూ నీళ్లు పోస్తూ ఉండాలి. బాణసంచా కాల్చే సమయంలో జాగ్రత్తలు పాటించాలని, అత్యవసర సమయంలో ఈ నెంబర్లకు ఫోన్ చేయాలని అగ్నిమాపక శాఖ అధికారులు చెబుతున్నారు.

వ్యాపారులూ జాగ్రత్త..

● నిబంధనలు పాటిస్తూ అనుమతుల మేర షాపులు ఏర్పాటు చేయాలి. ● వ్యాపారులు కూడా అప్రమత్తంగా ఉండాలి. నిబంధనలకు మించి నిల్వలు ఉంచకూడదు. ● దుకాణాలను పట్టణానికి దూరంగా, ఆరుబయట ప్రదేశంలో.. రేకుల షెడ్లలో ఏర్పాటు చేయాలి. ● దుకాణాలలో చిన్నపిల్లలను పనిలో పెట్టుకోకూడదు. ఎలక్ట్రికల్ వైరింగ్ సరిచూసుకోవాలి. ● అగ్నిమాపక సాధనాలను అందుబాటులో ఉంచాలి. ఇసుక, నీటి సౌకర్యం ఉండేలా చూసుకోవాలి.



అప్రమత్తతే శ్రీరామరక్ష



బాణసంచా కాల్చే సమయంలో ప్రమాదం జరిగితే గాయాలపై పసుపు, టూత్ పేస్ట్ వంటివి రాయకూడదు. గాయాన్ని నీటితో బాగా కడగాలి. వైద్యులను సంప్రదించాలి. అప్రమత్తంగా ఉంటేనే ఇలాంటి ప్రమాదాలు జరగకుండా ఉంటాయి.

-డాక్టర్ టి.జగన్మోహన్‌రావు, జిల్లా ప్రోగ్రాం అధికారి, పార్వతీపురం


అనుమతులు తప్పనిసరి



అనుమతులు లేకుండా మందుగుండు తయారు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవు. పల్లెలపై ప్రత్యేక నిఘా ఉంచాం. టపాసులను కాల్చే ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి. ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలి.

-నీలకంఠం, ఎస్ఐ, కొమరాడ

విజయనగరం	08922276101, 99637 29543
చీపురుపల్లి	89850 22289, 99637 229769
కొత్తవలస	08966 236101, 99637 29925
రాజాం	08941 251099, 99637 30364
ఎస్.కోట	08966 265319, 99637 29584
గజపతినగరం	08965 285277, 99637 29874
బాడంగి	9490559187, 9963 744781
సాలూరు	08964 242489, 99637 29764
బొబ్బిలి	08944 255299, 99637 29704
పార్వతీపురం	08963 221101, 99637 29679
జి.ఎల్.పురం	089632 23322, 95506 65765



కొఠియా

అక్కడ అన్నీ రెండే..

- కొఠియా గిరిజనులకు ఏపీ, ఒడిశా ప్రభుత్వాల సౌకర్యాలు

సాలూరు రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎక్కడైనా ప్రజలకు ఒక ప్రభుత్వం నుంచి రేషన్ కార్డు, ఓటరు కార్డు, ఇళ్లు, రక్షణ, పింఛన్లు తదితర పథకాలు అందుతుంటాయి. తాము నివశించే ప్రాంతాన్ని పాలిస్తున్న ప్రభుత్వం నుంచి సౌకర్యాలు అందడం సహజం. ఏవోబీలో ఉన్న కొఠియా గ్రూప్ గిరిజనులకు మాత్రం ఆంధ్ర, ఒడిశా... రెండు ప్రభుత్వాలు పోటాపోటీగా సౌకర్యాలను అందిస్తున్నాయి. ఏపీ కంటే ఒడిశా ఈ విషయంలో ఒక అడుగు ముందే ఉంది. ఏవోబీలో ఏపీ, ఒడిశా రాష్ట్రాల మధ్య కొఠియా గ్రూప్‌లో నేరేళ్లవలస, దొరల తాడివలస, మూలతాడివలస, కుంబిమడ, ధూళిభద్ర, ఎగువశెంబి, దిగువశెంబి, ఎగువ కొఠియా, దిగువ కొఠియా, ఎగువ గంజాయిభద్ర, దిగువ గంజాయిభద్ర, పట్టుచెన్నారు, పగులుచెన్నారు, కోనధార, సోలిపిగుడ, డొలియాంబ, ముడకారు, గాలిగబడారు, కురిడిభద్ర, అర్జువలస, ఫణికి తదితర 21 గ్రామాలు వివాదాస్పదంగా ఉన్నాయి. ఈ గ్రామాలు బ్రిటిష్ పాలనలో కోల్‌కత్తా, మద్రాస్ ప్రెసిడెన్సీల మధ్య వివాదంలో ఉండేవి. స్వాతంత్ర్యం అనంతరం ఏపీ ఒడిశాల మధ్య వివాదంలో ఉన్నాయి. ఈ గ్రామాలపై 1965 మార్చి నుంచి సుప్రీం కోర్టు స్టేటస్‌కో జారీ చేసింది. అప్పటి నుంచి ఇరు రాష్ట్ర ప్రభుత్వాలు కొఠియా గ్రామస్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాయి. కొఠియా గ్రూప్ గ్రామాల గిరిజనులకు ఇరు రాష్ట్రాలు రేషన్ కార్డులు, ఓటర్ కార్డులు, పింఛన్లు, ఇళ్లు, ఉపాధి హామీ పనులు, వ్యవసాయ పరికరాలు, విత్తనాలు, జీవనోపాధి పథకాలు తదితర వాటిని సమకూర్చుతున్నాయి. కొఠియా పేరుతో పోలీస్ స్టేషన్లను సైతం నిర్వహిస్తున్నాయి. రహదారులు, తాగునీరు, విద్యుత్, విద్య తదితర సౌకర్యాలను అందిస్తున్నాయి. ఏపీ రాష్ట్రం సాలూరు నుంచి నేరేళ్లవలస వరకు, ఒడిశా కుందిలి నుంచి కొఠియా వరకు బస్సు సౌకర్యం కల్పిస్తున్నాయి. వివాదం సంగతి ఎలా ఉన్నా... ఆ గ్రామాల ప్రజలకు మాత్రం ఎంచక్కా రెండు రాష్ట్రాల సంక్షేమ పథకాలు అందుతున్నాయి.



ఇరు రాష్ట్రాల కార్డులు (ఫైల్)



ఒడిశా పోలీసు బోర్డు

బొబ్బిలిలో నరకాసుర వధ



నరకాసురుని బొమ్మను దహనం చేస్తున్న దృశ్యం

బొబ్బిలి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానికంగా ఉన్న శ్రీ వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో బుధవారం రాత్రి నరకాసుర వధ కార్యక్రమాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు గెంబలి శ్రీనివాసరావు, మల్లికార్జునరావు, సామ్రాట్, భక్త సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో తొలుత ఆలయంలో సహస్ర పుష్పార్చన, కుంకుమ పూజలు చేసిన అనంతరం నరకాసురుని వధను నిర్వహించారు. ఎమ్మెల్యే బేబీనాయన పూజలు చేసిన అనంతరం నరకాసురుని బొమ్మపైకి బాణం విడిచిపెట్టి మతాబులతో కాల్చారు. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు వేలాది మంది తరలి వచ్చారు. ఈ కార్యక్రమంలో భాగంగా భారీ ఎత్తున బాణసంచాను కాల్చారు. గురువారం సాయంత్రం శ్రీధనలక్ష్మి అమ్మవారి ఆలయంలో దీపాలంకరణ చేస్తామని గెంబలి దంపతులు తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీ పి.శ్రీనివాసరావు, సీఐ కటకం శ్రీనివాసరావు, ఏఎస్ఐ జి.భాస్కరావు, హిందూ ఉత్సవసమితి అధ్యక్షుడు పెంట స్వామినాయుడు, చెలికాని కేశవ, యెన్నాబాబు, రోటరీ జిల్లా చైర్మన్ జేసీ రాజు, పాల్గొన్నారు.



నరకాసురుని పైకి బాణం ఎక్కుపెడుతున్న బేబీనాయన

పైడిమాంబను స్మరిస్తూ నగరంలో ర్యాలీ

- ఇరుముడితో నడిచిన దీక్షదారులు

విజయనగరం రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పైడిమాంబ దీక్షదారులు బుధవారం కుటుంబ సభ్యులతో కలిసి ఇరుముడితో నడుస్తూ అమ్మవారి స్మరణతో హోరెత్తించారు. ఉదయం 6 గంటలకు చదురుగుడి నుంచి గంటస్తంభం, కన్యకాపరమేశ్వరీ ఆలయం, ఎన్‌సీఎస్ రోడ్డు మీదుగా రైల్వేస్టేషన్ రోడ్డులో వున్న వనంగుడి వరకూ పాదయాత్ర చేశారు. సిరిమానోత్సవం కార్యక్రమంలో భాగంగా మండల, అర్ధమండల దీక్షలు చేసిన పైడిమాంబ దీక్షాదారులు అంతా వారి కుటుంబసభ్యులతో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.. అనంతరం దీక్షను విరమింప చేశారు. చండీహోమం, పూర్ణాహుతి అయ్యాక ఇరుముడులు పైడిమాంబకు సమర్పించి దీక్ష విరమణ చేశారు. దీక్షాదారుల సంఘం ప్రతినిధులు మహాపాత్రో, అచ్చిరెడ్డి ఆధ్వర్యంలో ఈ తంతు జరిగింది. ఆలయ ఈవో డీవీ ప్రసాదరావు, సూపరింటెండెంట్ ఏడు కొండలు, ఆలయ పూజారి బంటుపల్లి వెంకటరావుతోపాటు అర్చకులు, దేవదాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.





ఊరేగింపులో...



హోమం...



న్యూస్ బాక్స్

ఈ దీపావళి అందరి జీవితాల్లో వెలుగులు తేవాలి: కలెక్టర్

విజయనగరం కలెక్టరేట్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): కోటి దీపాల దీపావళి ప్రజలందరి జీవితాల్లో కొత్త వెలుగులు తేవాలని, అంతులేని ఆనందం, శ్రేయస్సు, ఆరోగ్యం సంపదతో వర్ధిల్లాలని ఆకాంక్షిస్తూ ప్రజలందరికీ జిల్లా కలెక్టర్ అంబేడ్కర్ దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. వెలుగులు నింపే పండుగగా, చెడుపై మంచి విజయానికి ప్రతికగా నిలిచే ఈ దీపావళి అందరికీ విజయాలను కలుగ జేయాలని అభిలషించారు. ఈ పండగను ఆనందంగా సురక్షితంగా జరుపుకోవాలని, టపాసులు కాల్చేటప్పుడు జాగ్రత్త తీసుకోవాలని సూచించారు.

సంతోషాలు నింపాలి

● మంత్రి కొండపల్లి శ్రీనివాస్

విజయనగరం కలెక్టరేట్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రజలందరి జీవితాల్లో చీకట్లు తొలగిపోయి సంతోషాల వెలుగులు నిండాలని రాష్ట్రమంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆకాంక్షించారు. దీపావళి సందర్భంగా రాష్ట్ర, జిల్లా ప్రజలకు ఆయన ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. చీకటిపై వెలుగు, చెడుపై మంచి విజయానికి ప్రతీక దీపావళి అని మంత్రి పేర్కొన్నారు. దీపావళి నుంచి ప్రతి ఇంటిలో దీపం 2 ద్వారా నిజమైన దీపావళి కాంతులను ఆంధ్రప్రదేశ్ ప్రజలందరికీ పంచుతున్నామని పేర్కొన్నారు. మతాబులు, చిచ్చుబుడ్డు, తారాజువ్వల వెలుగుతో దీపావళి కాంతితో, సిరి సంపదలతో ఈ దీపావళి ప్రతి ఇంట వెలుగులు నింపాలని కోరారు. ఈ పండగను ఆనందంగా, సురక్షితంగా జరుపుకోవాలని, టపాసులు కాల్చేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

అందరికీ మంచే జరగాలి

● జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండగ ప్రజలందరి జీవితాల్లో వెలుగులు నింపాలని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఆకాంక్షించారు. నేడు దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలుపుతూ బుధవారం ప్రకటన జారీ చేశారు. అమావాస్య నాటి కారు చీకట్లు తొలగించడానికి, దీపాలతో వెలుగును నింపడం ఈ పండగ సంప్రదాయమని, మనలోని జ్ఞానజ్యోతులు వెలిగించాలన్నది ఈ పండుగ వెనుక ఉద్దేశమని తెలిపారు. పర్యావరణహితంగా దీపావళి జరుపుకోవాలని, ఎటువంటి ప్రమాదాలు సంభవించకుండా ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

సైకిళ్ల పంపిణీ

రామభద్రపురం, అక్టోబరు30(ఆంధ్రజ్యోతి): అనాథ విద్యార్థులకు సైకిళ్లను వితరణగా అంద జేసినట్టు పాతరేగ జిల్లా పరిత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం వెంకటరావు తెలిపారు. తమ పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులకు వీకే యూనివర్సల్ ఫ్యామిలీ ఫౌండేషన్ వసుదైక కుటుంబం ద్వారా మూడు సైకిళ్లను అందజేసినట్టు ఆయన తెలిపారు. ఈ మేరకు ఫౌండషన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం

చీపురుపల్లి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల్ని కల్పించడానికి నిరంతరం ప్రాధ్యామిస్తామని జడ్పీ చైర్మెన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. చీపురుపల్లి పట్టణంలో పాతకుమ్మరి వీధి, కొత్తగవిడి వీధిలో 15 లక్షల జడ్పీ నిధులతో నిర్మించతల పెట్టిన సీసీ రోడ్డు పనులకు బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇప్పిలి వెంకటనరసమ్మ, జడ్పీటీసీ వలిరెడ్డి శిరీష, సర్పంచ్ మంగళగిరి సుధారాణి, నాయకులు, పంచాయతీరాజ్ డీఈ శ్రీనివాసరావు, ఎంఈవో రమేష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాములుకు సత్కారం

శృంగవరపుకోట, అక్టోబరు30(ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోట మండలం ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ పొట్నూరు శ్రీరాములును మంగళవారం రాత్రి అమలాపురం బ్యాడ్మింటన్ ఇండోర్ స్టేడియంలో డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వ్యాయమ ఉపాధ్యాయులు, ఎస్.జీ.ఎఫ్ కార్యదర్శి ఎ.వి శ్రీనివాస్ సత్కరించారు. రాష్ట్రస్థాయి ఎస్.జీ.ఎఫ్ బ్యాడ్మింటన్ పోటీలకు పరిశీలకునిగా ఇతను వెళ్లిన సంగతి తెలిసిందే.

ఓటరుగా నమోదుకండి

వంగర, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): వచ్చే మార్చిలో జరిగే ఎంఎల్‌సీ ఎన్నికలకు ఓటర్లుగా నమోదుకు నవంబరు 6 చివరి తేదీగా ప్రభుత్వం ప్రకటించిందని, అర్హతగల ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలని మండల యూటీఎఫ్ నాయకులు మురళి, రమణ, ప్రసాద్‌తో పాటు పలువురు కోరారు. మంగళవారం పలు గ్రామాల్లోని పాఠశాలలకు చేరుకుని ఫారమ్ 19లు సిబ్బందికి అందజేశారు. అర్హత గల ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

మద్యం షాపు వద్దు

కొత్తవలస, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): కొత్తవలస పంచాయతీ 202 కాలనీ సమీపంలో జనావాసాల మధ్య కొత్తగా మద్యం షాపు ఏర్పాటు చేయడాన్ని స్థానికులు తీవ్రంగా వ్యతిరేకించారు. షాపు తమ ప్రాంతంలో పెట్టొద్దని మహిళలు అడ్డుకున్నప్పటికీ మద్యంషాపునకు భవనం సిద్ధం చేయడంతో బుధవారం మహిళలు కొత్తవలస ఎక్సైజ్ రాజశేఖర నాయుడుకు ఫిర్యాదు చేశారు. తమ ప్రాంతంలో మద్యం షాపును ఏర్పాటు చేస్తే ఇబ్బందులు పడతామని మహిళలు ఎక్సైజ్ సీఐతో పాటు స్థానిక పోలీసులకు, తహసీల్దార్, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. తమకు న్యాయం జరిగే వరకు ఆందోళన చేస్తామని తెలిపారు.

కొత్తవి కడతామని.. ఉన్నవి కూల్చేశారు

▸▸ గత వైసీపీ సర్కార్ నిర్వాకం ▸▸ వియ్యంపేట, కొత్తవలస పీహెచ్‌సీల దుస్థితి ▸▸ కొత్త భవనం పూర్తికాక అద్దె భవనంలో అగచాట్లు




2019 వరకూ ఉన్న వియ్యంపేట పీహెచ్‌సీ భవనం, ఆ భవనం కూల్చేసి నిర్మాణం చేపట్టిన కొత్త భవనం దుస్థితి

కొత్తవలస, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): చక్కగా ఉన్న భవనాన్ని కూల్చేశారు. కూల్చిన భవనం స్థానంలో కొత్త భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయకపోవడంతో వియ్యంపేట పీహెచ్‌సీ అద్దె భవనంలో వసతుల లేమితో కొట్టుమిట్టాడుతోంది. మండలంలోని వియ్యంపేట పీహెచ్‌సీ చక్కటి అందమైన భవనంలో ఉండేది. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత నాడు-నేడు అంటూ ఉన్న పీహెచ్‌సీ భవనాన్ని కూల్చారు. అయితే కొత్త భవనం నిర్మాణం చేయడానికి నిధులు మంజూరు చేయకపోవడంతో భవన నిర్మాణం కోసం కాంట్రాక్టు తీసుకున్న గుత్తేదారుకు బిల్లులు చెల్లించకపోవడంతో భవన నిర్మాణపు పనులను మధ్యలోనే ఆపేసి వెళ్లిపోయాడు. దీంతో పీహెచ్‌సీని అద్దెభవనంలోకి మార్చారు. వియ్యంపేట పీహెచ్‌సీ మాత్రమే కాదు, కొత్తవలస పీహెచ్‌సీ పరిస్థితి అదే విధంగా మారింది. వియ్యంపేట పీహెచ్‌సీ భవన నిర్మాణ ప్రాంతంలో పిచ్చి మొక్కలు పెరగగా, కొత్తవలస పీహెచ్‌సీ భవన ప్రాంతంలో గల స్థలం వాహనదారులకు పార్కింగ్‌గా మారింది. ఈ రెండు పీహెచ్‌సీలను ఇటీవల స్థానిక శాసన సభ్యురాలు సందర్శించి భవనాలను పూర్తి చేయించడం కోసం ప్రయత్నాలు చేస్తున్నారు.

మున్సిపాలిటీలో పూర్తిగా అవినీతి తొలగాలి

● మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో వాడీవేడి చర్చ



కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ కౌన్సిలర్ శరత్‌బాబు



ప్రశ్నలకు వివరణ ఇస్తున్న కమిషనర్ రామలక్ష్మి

బొబ్బిలి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వం మారి తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అధికారులంతా కొత్తవారు వచ్చారు. గతంలో మాదిరిగా అవినీతి పోకడలను కొనసాగిస్తామంటే కుదరదు. పద్ధతులన్నీ మార్చుకోవాలి. లేకుంటే ఇబ్బందులకు గురవుతారు అని 8 వ వార్డు టీడీపీ కౌన్సిలరు రాంబార్కి శరత్‌బాబు హెచ్చరించారు. మున్సిపల్ చైర్మన్ సావు వెంకటమురళీకృష్ణారావు అధ్యక్షతన బుధవారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఆసక్తికరమైన చర్చ కొనసాగింది. తొలుత వైసీపీ కౌన్సిలరు మాట్లాడుతూ ఇటీవల టీడీఆర్ బాండ్ల జారీపై విజిలెన్స్ అధికారులు విచారణ జరపడం పట్టణంలో చర్చనీయాంశమైందన్నారు. కొత్తగా వచ్చిన టీపీవో అలాంటి వాటన్నిటికీ చెక్ పెట్టాలని ఆయన కోరారు. దీనిపై మున్సిపల్ కమిషనరు లాలం రామలక్ష్మి వివరణ ఇస్తూ గతంలో జారీ చేసిన టీడీఆర్ బాండ్లకు సంబంధించి ప్రభుత్వం ఓ ఫార్మాట్ ఇచ్చిందని దాని ప్రకారం నివేదిక కోరిందన్నారు. రాంబార్కి శరత్‌బాబు మాట్లాడుతూ కొంతమంది కాంట్రాక్టర్ల విషయంలో ఎందుకు లాలూచీ పడుతున్నారని ప్రశ్నించారు. కార్యాలయంలో కొంతమంది కాంట్రాక్టర్లు రోజంతా తిష్ట వేస్తున్నారని.. ఏఈల కుర్చీల్లో నే కూర్చుంటున్నారని ఇది పద్ధతి కాదన్నారు. గతంలో ఎవరైనా ఇళ్లు కట్టుకోవాలంటే చాలా భయపడేవారు. టౌన్‌ప్లానింగ్ విభాగంలో అవినీతి ఇందుకు నిదర్శనమన్నారు. ఇకమీదట అలా జరగడానికి వీలులేదని ఆయన అన్నారు. ట్రాక్టర్ల మరమ్మతుల కోసం 3.80 లక్షలు వెచ్చించడాన్ని వైస్‌చైర్మన్ చెలికాని మురళీకృష్ణ ప్రశ్నించారు. 4.20 లక్షలతో ఐదు కంప్యూటర్లు, ప్రింటరు కొనుగోలు చేయాలన్న ప్రతిపాదనపై సభ్యులు ఆమోదం తెలిపారు. గతంలో కొనుగోలు చేసిన కంప్యూటర్లు ఎన్ని ఉన్నాయన్న దానికి అధికారులు సమాధానం చెప్పలేకపోవడం గమనార్హం. ఆ సమాచారం అందుబాటులో లేదని కమిషనరు బదులిచ్చారు. సమావేశంలో మేనేజరు రాఘవాచార్యులు, డీఈఈ కిరణ్‌కుమార్, ఏఈలు కోటేశ్వరరావు, వీవీఎస్ఎన్ ఈశ్వర గుప్త, రవి, ఆర్వో నాగరాజు, టీపీవో రేవతి, టీపీఆర్వో జగన్మోహన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళి, ఆర్ఐ సురేష్‌బాబు, సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నడిపల్లిలో డయేరియా

● 22 మందికి అస్వస్థత

● బాధితులను పరామర్శించిన కూటమి నాయకులు



డయేరియా బారినపడ్డవారితో మాట్లాడుతున్న లోకం నాగమాధవి



స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో బాధితులను పరామర్శిస్తున్న కర్రోతు

పూసపాటిరేగ, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలో నడిపల్లి గ్రామం డయేరియా బారిన పడింది. రెండురోజులుగా నేటికి 22మంది వరకూ దీనిబారిన పడినట్లు సమాచారం. ముఖ్యంగా రజకవీధిలో చాలా మంది డయేరియా బారిన పడ్డారు. పంచాయతీ పరిధిలో పెదనడిపల్లి గ్రామంలోనే డయేరియా వచ్చింది. ఇప్పటికే కొందరికి చికిత్సచేసి పంపగా గ్రామంలో నేటికీ దీనితో చికిత్స పొందుతున్నవారు సుమారు 11మంది ఉన్నట్లు తెలిసింది. దీనిబారిన పడ్డవారు స్థానిక పూసపాటిరేగ ప్రాథమిక ఆర్యోగ కేంద్రంలో చికిత్స పొందుతుండగా, కొందరు విజయనగరంలో ప్రయివేటు ఆసుపత్రులకు, భోగాపురం సీహెచ్‌సీలకు వెళ్లి చికిత్స పొందుతున్నారు. గ్రామంలో వివిధ శాఖల అధికారులు పర్యటించారు. డయేరియా బారిన పడ్డవారు వెంటనే ఆసుపత్రికి రావాల్సిందిగా వైద్యాధికారి రాజేష్‌వర్మ తెలిపారు. బుధవారం స్థానిక ఎమ్మెల్యే లోకం నాగమాధవి, మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజుతోపాటు కూటమి నాయకులు పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్నావారితోపాటు, గ్రామంలో బాధితులను పరామర్శించారు. ఎరుకొండ జంక్షన్‌లో గల చేతిపంపు నీరు తాగుతున్నామని బాధితులు తెలిపారు. అయితే దీనికి సూపర్‌క్లోరినేషన్ చేశారని, వెంటనే ఈ నీటిని తాగటం కారణంగా ఈసమస్య తలెత్తినట్టు అధికారులు ప్రాథమిక అంచనా. ఈ నీటిని పరీక్షల నిమిత్తం పంపించామన్నారు.

ఎంపీ అప్పలనాయుడికి సన్మానం


అమరావతి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): తెలుగువారు ఎక్కడున్నా, ఏ రంగంలో ఉన్నా.. ఆయా రంగాలకు వన్నె తేవాలని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు పిలుపునిచ్చారు. ముంబైలోని గోకుల్ హాల్‌లో ఫెడరేషన్ ఆఫ్ తెలుగు అసోషియేషన్స్ ఆఫ్ మహారాష్ట్ర ఆధ్వర్యంలో ఎంపీ అప్పలనాయుడును సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ తెలుగువారందరూ కలిసి అసోషియేషన్స్‌గా ఏకతాటి మీదకు రావడం, అందరితో కలిసి సన్మానాన్ని అందుకోవడం సంతోషంగా ఉందన్నారు. నాడు ఎన్టీఆర్, నేడు చంద్రబాబు తెలుగువారి ఆత్మగౌరవానికి, తెలుగుజాతి ఔన్నత్యానికి ప్రతీకగా వారి అభివృద్ధి పట్ల చిత్తశుద్ధితో పనిచేస్తున్నారన్నారు. మహారాష్ట్రలో తెలుగువారి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు, ఫెడరేషన్ ఆఫ్ తెలుగు అసోషియేషన్స్ ఆఫ్ మహారాష్ట్ర చైర్మన్ వీవీ రమణ, అధ్యక్షులు గంజి జగన్‌బాబు, ప్రధాన కార్యదర్శి కంటే అశోక్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నరకాసురునివధ నాటకం



వేపాడ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సోంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 3,4,5 తరగతులు విద్యార్థులు బుధవారం పాఠశాలలో ప్రదర్శించిన నరకాసురుని వధ నాటకం చూపరులను ఎంతగానో ఆకట్టుకుంది. దీపావళి పండగను పురష్కరించుకొని నేటి సంప్రదాయాలు, ఆచారాలు, పండగలు, విలువలు మరిచిపోతున్న నేటి తరుణంలో విద్యార్థుల్లో పాతకాలపు విలువలు, ఆచారాలు, సంప్రదాయాలపై ఆశక్తి పెంచేలా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల వేషధారణలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో శ్రీనివాసరావు, రమేష్ నాయుడు, సన్యాసినాయుడు, తదితర ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

108 శివలింగాలకు పూజలు



రుద్రాభిషేకం కార్యక్రమంలో పాల్గొన్న శివభక్తులు

కొత్తవలస, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ఆశ్వీయుజమాస మాస శివరాత్రి సందర్భంగా మండలంలోని తుమ్మికాపల్లి గేట్ సమీపంలోని ఓం సదనంలో 108 శివలింగాలకు మహన్యాసపూర్వక రుద్రాభిషేకాలను బుధవారం ఉదయం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా శివభక్తులు మాలధారణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్తీక మాసాన్ని పురష్కరించుకుని నెల రోజులపాటు సదనంలో 108 శివలింగాలకు ప్రత్యేక పూజలను నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు అంపోలు ఉమామహేశ్వర శర్మ తెలిపారు. కార్యక్రమంలో అర్చకుడు కిరణ్ కుమార్ శర్మ పాల్గొన్నారు.

జర్నలిస్టులకు అండగా ఉంటాం

విజయనగరం టౌన్, అక్టోబరు30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులకు అండగా ఉండి, వారి సంక్షేమానికి సహకారం అందిస్తామని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అన్నారు. తెలుగు జర్నలిస్టు ఫోరం(టీజేఎఫ్) ఆధ్వర్యంలో ఎస్వీఎస్ లేక్ ప్యాలెస్ హోటల్లో బుధవారం దీపావళి సంబరాలు నిర్వహించారు. టీజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎంఎంఎల్ నాయుడు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి కలెక్టర్ అంబేడ్కర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలను ప్రభుత్వ నిబంధనల మేరకు అందజేసేందుకు కృషి చేస్తామన్నారు. జర్నలిస్టుల సంక్షేమానికి టీజేఎఫ్ ఇటువంటి కార్యక్రమాలు చేపట్టడం శుభపరిణామం అని, ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడానికి తమ వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని తెలిపారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి

విద్యావ్యవస్థలో నెలకొన్న సమస్యలను పరిష్కరించే దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు కోరారు. నగరపాలక సంస్థ పరిధిలోని పాఠశాలల్లో, మున్సిపల్ హైస్కూల్‌లో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిల్లా వ్యాప్తంగా ర్యాలీలు చేశారు. విజయనగరం, బొబ్బిలి, కొత్తవలస, గజపతినగరంలో ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు తహసీల్దార్లకు వినతిపత్రం సమర్పించారు.

-ఆంధ్రజ్యోతి బృందం



గజపతినగరంలో..



విజయనగరంలో...



కొత్తవలసలో..

వివాహిత ఆత్మహత్య



శ్రావణి (ఫైల్)

శృంగవరపుకోట రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సన్యాసయ్యపాలెం గ్రామానికి చెందిన దొడ్డ శ్రావణి(22) బుధవారం ఉదయం ఉరివేసుకుని మృతిచెందింది. దీనికి సంబంధించి స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శ్రావణికి ఏడాది క్రితం మండలంలోని రాజీపేట గ్రామానికి చెందిన దొడ్డ కిశోర్‌తో వివాహమైంది. అతను పాల వ్యాన్ నడుపుతున్నాడు. కానీ వివాహిత గత కొద్దికాలంగా సన్యాసయ్యపాలెంలోని తన కన్నవారి ఇంటిలో ఉంటోంది. ఆమె స్థానికంగా ఒక ప్రైవేటు పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తోంది. ఈ క్రమంలో బుధవారం ఉదయం తాను పాఠశాలకు వెళ్తానని క్యారేజీ కట్టాలని తల్లి లక్ష్మికి చెప్పింది. క్యారేజీ కట్టాక లక్ష్మి పొలానికి వెళ్లిపోయింది. తల్లిదండ్రులు పొలానికి వెళ్లాక ఇంట్లో ఉన్న ఫ్యాన్‌కు ఉరివేసుకుని శ్రావణి ఆత్మహత్య చేసుకుంది. పొలం నుంచి తల్లి తిరిగి వచ్చాక ఇంటిలో చూసేసరికి కూతురు ఆత్మహత్య చేసుకుని కనిపించింది. దీంతో పోలీసులకు సమాచారం అందించారు. శ్రావణి మృతికి గల కారణాలు తెలియరాలేదు. ఘటనపై తండ్రి జగన్నాథం ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ గంగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ ఘటనతో గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది.

యువకుడి అదృశ్యం

రామభద్రపురం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని నేరెళ్లవలస గ్రామానికి చెందిన పసుపులేటి మధు అదృశ్యమైనట్టు ఎస్ఐ వెలమల ప్రసాద్ తెలిపారు. చిననేరెళ్లవలసకు చెందిన పసుపులేటి సీతతో 9 సంవత్సరాల క్రితం వివాహమైంది. భార్య ఫిర్యాదు మేరకు అదృశ్యమైనట్టు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

గిరిజన యువతి ఆచూకీ లభ్యం

కొత్తవలస, అక్టోబర్ 30(ఆంధ్రజ్యోతి): అప్పన్నదొరపాలెం గ్రామానికి చెందిన గిరిజన యువతి ఇటీవల కిడ్నాప్‌కు గురైందని ఆరోపణలు వెల్లువెత్తాయి. దీనిపై దర్యాప్తు చేసిన పోలీసులు సదరు యువతి తన ప్రియుడితో కలసి వెళ్లిపోయినట్టు గుర్తించి విజయవాడ నుంచి కొత్తవలస పోలీసుస్టేషన్‌కు బుధవారం తీసుకొచ్చారు. మేజర్లు కావడంతో ఇద్దరం ప్రేమించుకుని తమ ఇష్టప్రకారమే వెళ్లిపోయామని పోలీసులకు ఇచ్చిన వాంగ్మూలంలో వారిరువురు పేర్కొన్నారు. పోలీసు స్టేషన్‌కు తీసుకొచ్చిన జంటను అప్పన్నదొరపాలెం గ్రామస్థులు, తల్లి సమక్షంలో పోలీసులు చూపించారు.

సారా తయారీ కేంద్రంపై దాడి

విజయనగరం క్రైం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి విజయనగరం జిల్లాలోని జియమ్మవలస మండలం గడసింగాపురం గ్రామ శివార్లలో బుధవారం ఇన్‌స్పెక్టరు ఎస్ సింహాద్రి, సిబ్బంది సారా తయారీ కేంద్రంపై దాడి చేశారు. ఈ దాడిలో 700 లీటర్ల బెల్లంఊటను, సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్టు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐ రామారావు, హెచ్‌సీ రాంబాబు, కానిస్టేబుల్స్ రాము, జనార్దనరావు, ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం సీసాల స్వాధీనం

విజయనగరం క్రైం, అక్టోబరు 30: ఎన్‌ఫోర్సుమెంటు ఇన్‌స్పెక్టర్ సింహాద్రి ఆధ్వర్యంలో సీతానగరం మండలంలోని బక్కుపేట గ్రామ పరిధిలో పోలీసులు దాడులు నిర్వహించారు. గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న మహిళను, ఆమె వద్ద ఉన్న 16 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ రమణారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆమెపై కేసు నమోదు చేసి, తదుపరి విచారణ నిమిత్తం ఎక్సైజ్, ప్రొహిబిషన్ స్టేషన్‌కి అప్పగించామని ఆయన తెలిపారు.

గజపతినగరం, అక్టోబరు30(ఆంధ్రజ్యోతి): అక్రమంగా మద్యం తరలిస్తున్న ఇద్దరు నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై లక్ష్మణరావు బుధవారం తెలిపారు. మెంటాడ మండలం మెంటాడ గ్రామానికి చెందిన ఆదిరెడ్డి సత్యనారాయణ, ఇప్పలవలస గ్రామానికి చెందిన గెద్ద కాశీ విశ్వనాథం మెంటాడ నుంచి ద్విచక్రవాహనంపై 200 మద్యం సీసాలు తరలిస్తున్నారు. దీనిపై సమాచారం అందుకుని గజపతినగరం మండలంలోని సాలిపేట గ్రామం వద్ద సిబ్బంది సహాయంతో దాడి చేయగా మద్యం సీసాలు దొరికినట్టు ఎస్ఐ తెలిపారు. వాహనంతో పాటు మద్యంసీసాలను స్వాధీనం చేసుకుని కేసునమోదు చేశామన్నారు.

సారా ఊట ధ్వంసం

సాలూరు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి) మండలంలోని నక్కడవలస సమీపంలో సారా తయారీకి సిద్ధం చేసిన సుమారు 400 లీటర్లు బెల్లం ఊటను సిబ్బంది సహాయంతో ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సీఐ జి.దాస్ తెలిపారు. పాచిపెంట మండలంలోని పాంచాలిలో బెల్ట్‌షాపు నిర్వహిస్తున్న పసుమర్తి ఈశ్వరరావు నుంచి ఏడు క్వార్టర్ బాటిల్‌ను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

కొమరాడ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): కూనేరు చెక్‌పోస్టు వద్ద పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా ఒడిశా నుంచి ఆంధ్రాలోకి ద్విచక్రవాహనంపై సారా తరలిస్తున్న వ్యక్తి వాహనం విడిచిపెట్టి నిందితుడు పరారైనట్లు ఎస్ఐ నీల కంఠం తెలిపారు. ద్విచక్రవాహనంతో పాటు వాహనంపై ఉన్న భారీ ట్యూబుల్లో ఉన్న సారాను కూడా స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. సుమారు 80 లీటర్ల సారా తరలిస్తున్నట్లు గుర్తించామని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

విద్యుదాఘాతంతో ఆవు దూడ మృతి

గరుగుబిల్లి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తోటపల్లిలో బుధవారం విద్యుదాఘాతంతో రొక్కం లక్ష్మణరావుకు చెందిన ఆవు దూడ మృతి చెందింది. గ్రామ శివారున వ్యవసాయానికి సంబంధించి ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ ఎర్తవైరు నుంచి విద్యుత్ సరఫరా అవుతున్న సమయంలో అటుగా వెళ్లిన దూడ విద్యుదాఘాతానికి గురైంది.

మ్యూజియంలో చోరీపై కేసు నమోదు

సీతంపేట రూరల్: సీతంపేట పీఎంఆర్‌సీ కేంద్రంలో నిర్మిస్తున్న గిరిజన మ్యూజియంలో రెండు రోజుల కిందట జరిగిన చోరీపై ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అమ్మన్నరావు తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

విద్యుత్ సబ్ స్టేషన్లు ఏర్పాటు చేయండి



కళాను కలిసిన విద్యుత్ శాఖ అధికారులు

రాజాం/గరివిడి, అక్టోబరు30(ఆంధ్రజ్యోతి): చీపురుపల్లి నియోజకవర్గం పరిదిలో విద్యుత్ సబ్ స్టేషన్లు అవసరం ఉన్న మేరకు ఏర్పాటు చేయాలని చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు ఆదేశించారు. బుధవారం విద్యుత్ పర్యవేక్షక ఇంజినీరు సిబ్బంది రాజాం క్యాంపు కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. గరివిడి ఫేకర్ కాలనీకు ఎన్నో యేళ్లుగా విద్యుత్ సమస్యలు ఉండేవని, ఇటీవల గతంలో పనిచేసిన డీఈ దృష్టికి తీసుకు వెళ్లడంతో పరిష్కరించారన్నారు. ప్రజలకు విద్యుత్ సమస్యలు రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని కళా ఆదేశించారు. ఎస్ఈ లక్ష్మణరావు ఉన్నారు.

బెల్టుషాపులకు మద్యం సరఫరా చేయొద్దు

రాజాం రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): రేగిడి, వంగర, సంతకవిటి మండలాల పరిధిలోని గ్రామాలలో బెల్టుషాపులు ఏర్పాటు చేసినా, వాటికి మద్యం షాపుల యజమానులు మద్యం సరఫరా చేసినా కేసులు నమోదు చేస్తామని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం చర్యలు తప్పవని రాజాం రూరల్ సి.ఐ. ఉపేంద్రరావు స్పష్టం చేశారు. తన చాంబర్‌లో బుధవారం రాత్రి మద్యంషాపుల యజమానులతో ఆయన సమావేశమయ్యారు. గ్రామాలలో బెల్టుషాపుల నిర్వహణ, మద్యం అమ్మకాలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధమని స్పష్టం చేశారు. బెల్ట్‌షాపుల నిర్వహణకోసం గ్రామాలలో వేలంపాటలు నిర్వహించినా చర్యలు తప్పవన్నారు. ఇదిలా ఉంటే పోలీస్ అమరవీరుల వారోత్సవాలలో భాగంగా రాజాం టౌన్ పోలీసుల ఆధ్వర్యంలో పట్టణంలోని మెయిన్‌రోడ్‌లో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు.

పాలకొండలో కొవ్వొత్తుల ర్యాలీ

పాలకొండ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పాలకొండలో పోలీసుల అమరువీరులకు సంఘీభావంగా డీఎస్పీ ఎం.రాంబాబు ఆధ్వర్యంలో బుధవారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కార్య క్రమంలో సీఐ చంద్రమౌళి పాల్గొన్నారు.

మత్స్యకారుల అభివృద్ధే ధ్యేయం

● గిరిజన సంక్షేమశాఖ మంత్రి సంధ్యారాణి



సాలూరు రూరల్: చేపపిల్లలు విడిచిపెడుతున్న సంధ్యారాణి

సాలూరు రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల అభివృద్ధే ప్రభుత్వం ధ్యేయమని రాష్ట్ర మహిళా, శిశు, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. బుధవారం సాలూరు మండలంలోని ముచ్చర్లవలస వద్ద వెంగళరాయసాగర్‌లో చేపల పిల్లలను విడిచిపెట్టారు.కార్యక్రమంలో అన్నంరాజువలస సర్పంచ్ చీమలరాములమ్మ, శంబర ఎంపీటీసీ తీళ్ల పోలినాయుడు, సాలూరు, మక్కువ టీడీపీ మండలాధ్యక్షులు ఆముదాలపరమేశు, గుల్ల వేణుగోపాలరావు, మాజీ సర్పంచ్ అక్యాన తిరుపతిరావు, తాడుతూరు శ్రీనివాసరావు, యుగంధర్, మత్స్యకారశాఖ అధికారులు నిర్మలకుమారి,తిరుపతయ్య పాల్గొన్నారు. కాగా మృతి చెందిన దత్తివలస అంగన్‌వాడీకార్యకర్త బంగారమ్మ కుటుంబాన్ని సంధ్యారాణి పరామర్శించారు

●మక్కువ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషిచేస్తోందని మంత్రి గుమ్మడి సంధ్యారాణి తెలిపారు. రాడవలస నుంచి కవరివలస వరకు బీటీ రోడ్డు, శంబర, మవుడి బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ములక్కాయ వలసలో ఆరోగ్యఉపకేంద్రం నిర్మాణానికి శిలాఫలకం ఆవిష్కరించారు. కార్య క్రమంలో టీడీపీరాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్పీబెంజ్‌దేవ్, పార్టీ మండలాధ్యక్షుడు గుల్ల వేణుగోపాల్, సాలూరు నియోజకవర్గ జనసేన సమన్వయకర్త గేదెల రిషివర్ధన్, తీల్లపోలినాయుడు, తిరుపతిరావు, మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

ఈశ్వరరావు అడారు	లక్ష్మీతులసి అడ్డాపుశీల	కర్రి తాతబాబు బాలగుడబ
ఎం.హైమవతి బందలుప్పి	ఎల్.దుర్గారావు బుదురువాడ	కె.కేశవరావు చినబొండపల్లి
డి.అనిత డి.కె.పట్నం	ఆర్.అప్పలనాయుడు డోకిశీల	వి.నాగరాజు గంగాపురం
సీహెచ్ సింహాచలం గోచెక్క	డి.హైమావతి గోపాలపురం	యు.పెంటయ్య జమదాల
ఎం.పార్వతి జమ్మిడివలస	కె.శ్రీధర్ కవిటిభద్ర	కె.శ్రీనివాసరావు క్రిష్ణపల్లి
కె.క్రిష్ణ ఎల్.ఎన్.పురం	పి.రామారావు ఎం.ఆర్.నగరం	టి.చిట్టిబాబు ములగ
ఎస్.మనీషా నర్సిపురం	నూకరాజు వెలగవలస	ఆర్.తిరుపతిరావు పెదబొండపల్లి
ఎం.హరనాధ్ పెదమరికి	టి.అప్పలనాయుడు పులిగుమ్మి	బి.రమేష్ పుట్టూరు
పి.సురేష్ రావికోన	జి.అన్నపూర్ణ సంగంవలస	ఎ.వినోద్‌కుమార్ సూడిగాం
బి.యశోద తాళ్లబురిడి	కె.శ్రీదేవి వి.ఆర్.పేట	పి.గంగమ్మ వెంకంపేట

తాగునీటి సరఫరాకు ప్రణాళికలు

●పార్వతీపురం ఎమ్మెల్యే విజయచంద్ర

పార్వతీపురంటౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది జనవరి నుంచి తాగునీటి సరఫరా కోసం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని ఎమ్మెల్యే బోనెల విజయ చంద్ర తెలిపారు. బుధవారం మునిసిపల్ ఛైర్‌పర్సన్ బోను గౌరీశ్వరీ అధ్యక్షతన సాధారణ సమావేశం జరిగింది. తొలుత వైస్‌ఛైర్మన్ ఐ.గున్నేశ్వరరావు మాట్లాడుతూ తాగునీటి సరఫరాకు సంబంధించి ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. పారిశుధ్య నిర్వహణపై శ్రద్ధ చూపించాలని పలువురు కౌన్సిలర్లు కోరారు. దీంతో ఎమ్మెల్యే మాట్లాడుతూ నాలుగున్నరేళ్లుగా తాగునీటి సరఫరాకు వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి వల్ల పార్వతీపురంలో ప్రజలు ఇబ్బందులు పడ్డారని, ఆ కష్టాలు లేకుండా చూసే బాధ్యత మనందరిపై ఉందన్నారు. అనంతరం అన్న క్యాంటీన్ నిర్వహణకు వైస్‌ఛైర్మన్ ఐ.గున్నేష్ రూ.10 వేలు విరాళాన్ని ఛైర్‌పర్సన్ గౌరీశ్వరీ చేతుల మీదుగా ఎమ్మెల్యేకు అందజేశారు. సమావేశంలో ఎస్ఏసీ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన డీఈ శ్రీనివాసరాజు కౌన్సిలర్లకు పరిచయం చేసుకున్నారు.

● బెలగాం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి):క్రీడల్లో రాణించి పట్టణానికి పేరు తేవాలని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర కోరారు. పట్టణానికి చెందిన కిషోర్ ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి బాడీ బిల్డింగ్ పోటీల్లో 65 కేజీల విభాగంలో ప్రథమ స్థానం సాధించ డంతో బుధవారం క్రిప్టాన్ జిమ్ వద్ద సన్మానించారు.

జేఎల్‌ఎంకు షోకాజ్ నోటీసు

సాలూరు రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పణికిలవలస జేఎల్‌ఎం ప్రవీణ్‌కు షోకాజ్ నోటీసును జారీ చేసినట్లు ఏపీఈపీడీసీఎల్ డీఈ గోపాలరావునాయుడు బుధవారం తెలిపారు. పణికిలవలసలో కొందరు గిరిజనుల ఇళ్లకు విద్యుత్ సరఫరా నిలిపివేతపై సోమవారం సాలూరు ఏడీఈ రంగారావుపై మంత్రి గుమ్మిడి సంధ్యారాణి మండిపడిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఏడీఈ రంగారావు ఆ గ్రామానికి వెళ్లి పరిశీలించారు. కొందరు గిరిజనులు జేఎల్‌ఎంకు డబ్బులిచ్చినట్లు నిర్ధారించారు. ఈ నేపథ్యంలో జేఎల్‌ఎం ప్రవీణ్‌కు షోకాజ్ జారీ చేశారు.

సభ్యత్వ నమోదు చురుగ్గా చేపట్టాలి

కురుపాం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో టీడీపీ సభ్యత్వం నమోదు కార్యక్రమం చురుగ్గా చేపట్టాలని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి కోరారు. బుధవారం కురుపాంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేష్ చంద్రదేవ్, రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి కోలా రంజిత్‌కుమార్, టీడీపీ మండల కన్వీనర్ కొండయ్య పాల్గొన్నారు.

మరుగుదొడ్లను వినియోగంలోకి తీసుకురావాలి

సాలూరు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి):మునిసిపాలిటీలోని సామాజిక మరుగు దొడ్లను వినియోగంలోకి తీసుకురావాలని కౌన్సిలర్లు కోరారు. వినియోగంలోకి తేకుండా విడిచిపెట్టడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. బుధవారం మునిసిపల్ ఛైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ అధ్యక్షతన జరిగిన జరిగిన సమావేశంలో పలు అంశాలపై చర్చ జరిగింది. శ్యామలాంబ పండుగ నేపథ్యంలో సామాజిక మరుగుదొడ్లకు మరమ్మతులుచేసి వినియోగంలోకి తేవాలని కౌన్సిలర్ శ్రీనివాసరావు కోరారు.